క్లుప్తంగా

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని సీఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్ ప్లేట్ సరిగా లేని వాహనదారులు, డ్రైవింగ్ చేస్తున్న మైనర్‌ను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లనర్సంపల్లిలో 'కనువిప్పు' కార్యక్రమం

దౌల్తాబాద్(దుబ్బాక): చిన్న చిన్న గొడవలకు పోయి జీవితాన్ని పాడు చేసుకోవద్దని ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి యువత సూచించారు. శనివారం రాత్రి మండల పరిధిలోని చెట్ల నర్సంపల్లిలో ప్రజలకు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే గ్రామ పెద్దలతో మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ కళా బృందం సభ్యులు మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్, ఎంపీటీసీ లక్ష్మీనర్సవ్వ, ఉప సర్పంచ్ స్వామి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపుతుందని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రాంసాగర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం నిర్వహించే పోరాటంలో ప్రజలంతా ఐక్యంగా పాల్గొని మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడూరి రవీందర్, నాయకులు దాసరి మహేష్, నీల భిక్షపతి, తాడూరి రవి, గణేష్, అనిల్‌కుమార్, ప్రకాష్, చిన్న నర్సయ్య పాల్గొన్నారు.

రేపు సిద్దిపేటలో 'ధర్మయుద్ధం'



మాట్లాడుతున్న రవిబాబు

సిద్దిపేటకమాన్: ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 5న సిద్దిపేటలో నిర్వహించనున్న ధర్మయుద్ధం ధర్నాను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సత్తయ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు రాజు, సురేష్, ప్రశాంత్, పరమేశ్వరి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

గజ్వేల్‌రూరల్: నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి విద్యాకర్‌నాయి పిలుపునిచ్చారు. ఆదివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రగతి పథంలో 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్ కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఈనెల 5న దశాబ్ది ఉత్సవ నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏకగ్రీవ తీర్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోడూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సామల మధుకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా మద్దతు ఇస్తామని ఆదివారం గ్రామ కురుమ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రూ. 50 వేలను మధుకు అందజేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు బట్టు శంకరయ్య పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



మద్దూరు: బోనాలతో మహిళలు

మద్దూరు(హుస్నాబాద్)/కొండపాక(గజ్వేల్)/హుస్నాబాద్‌రూరల్: మండలంలోని లద్నూరు, చేర్యాల మండలంలోని కమాలయపల్లిలో ఆదివారం పోచమ్మ బోనాలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లతో పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అలాగే కుకునూరుపల్లి మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు చేపట్టారు. బీరప్ప దేవాలయంలో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో పోచమ్మ బోనాలు నిర్వహించారు.



కుకునూరుపల్లిలో..



గాంధీనగర్‌లో..

అవినీతి పాలనను గద్దె దించండి



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): బీఆర్ఎస్ అవినీతి పాలనను గద్దె దించాలని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కాన్గల్‌లో శనివారం రాత్రి దుబ్బాక ఆత్మగౌరవయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామియాదవ్, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్తయ్య, నాయకులు నరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

కొండపాక(గజ్వేల్): సబ్బండ వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ వాసరి లింగారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్ల మాజీ ఎంపీటీసీ సభ్యుడు నందాల ఆంజనేయులు, సర్పంచ్ గూడెపు లక్ష్మారెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. అన్ని గ్రామాల్లో కమిటీలు వేస్తున్నామని తెలిపారు.

సన్మానం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైస్కూల్లో అటెండర్‌గా ఉద్యోగం పొందిన మిద్దె కిష్టయ్యను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అసోసియేషన్ సభ్యులు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కిష్టయ్య వీఆర్ఏగా పని చేసి పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఉద్యోగం పొందారని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, నాయకులు గాజులపాటి శ్రీనివాస్, సురేష్, శాదుల్ హుస్సేన్, బుచ్చిరెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం'

దుబ్బాకరూరల్: రాబోయే ఎన్నికల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పోతారెడ్డిపేటలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని పేర్కొన్నారు. గత ఉపఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావు నియోజకవర్గానికి చేసిందేమి లేదన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో నిలిచి పోయాయని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చింతల కృష్ణ, బండి పరుశురాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మహ్మద్‌షాపూర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దౌల్తాబాద్(దుబ్బాక): ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదివారం మండలంలోని మహ్మద్‌షాపూర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న నల్లపోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు రూ. 50 వేల విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పోతరాజు కిషన్, కోనాయిపల్లి సర్పంచ్ సురేందర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నర్సింహులు, భూపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, శ్రీనివాస్, ఉపసర్పంచ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



తుమ్మ చెట్లు తొలగించరూ..?

సీసీ రోడ్డును కమ్మేసిన తుమ్మ చెట్లు

హుస్నాబాద్‌రూరల్: పట్టణంలోని 4వ వార్డులో సీసీ రోడ్డుపైకి తుమ్మ చెట్లు రావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా స్పందించి తుమ్మ చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

సమ్మె నోటీసు అందజేత

నారాయణఖేడ్: తమ సమస్యలు పరిష్కరించనిపక్షంలో సమ్మె చేపడతామని అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు నారాయణఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయడంతో పాటు ఉద్యోగభద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పిస్తూ పదవీవిరమణ సందర్భంగా రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని స్పష్టం చేశారు. నోటీసు అందజేసినవారిలో సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి, అంగన్‌వాడీ టీచర్ల సంఘం బాధ్యులు నాగేశ్వరి, వీణా కుమారి, శాంతాబాయి, స్వరూప, అనురాధ, నిర్మల, లక్ష్మి, పుణ్యవతి, శ్యామల, పద్మ, బాలమణి, యాదమ్మ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ప్రజలతో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, ప్రవీణ్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లిలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈసారి హుస్నాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని మండిపడ్డారు. తాము అధికారంలో రాగానే రూ. 500కే వంటగ్యాస్, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ అభయహస్తం కింద ఎస్సీ, ఎస్టీలకు రూ. 12 లక్షలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, చౌటపల్లి అధ్యక్షుడు పులికాశి రమేష్, నాయకులు కేడం లింగమూర్తి, ఎండీ హసన్, రమేష్, భాస్కర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

400 రోజులకు చేరిన దీక్షలు



కొనసాగుతున్న రిలే నిరహార దీక్షలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం నాటికి 400 రోజులకు చేరుకున్నాయి. నూతన మండలం చేయాలని కోరుతూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మంత్రి హరీశ్‌రావు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందించారు. అలాగే కొండపోచమ్మ వరకు పాదయాత్ర నిర్వహించారు. ప్రగతి భవన్‌కు పోస్టు కార్డులు రాసి పంపారు. కానీ ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. తిగుల్‌ను మండలం చేసేందుకు పది గ్రామాలు అనుకూలంగా ఉన్నట్లు తిగుల్ మండల సాధన సమితి సభ్యులు, సర్పంచ్ భానుప్రకాష్‌రావు తెలిపారు. రానున్న సాధారణ ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పారు.

మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సురేందర్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి దిశగా సాగుతుందని బీజేపీ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగాలు లేవని, ఉపాధి లేక యువత రోడ్లపై తిరుగుతున్నారని వాపోయారు. అనంతరం పలువురిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల, మనోహర్‌రావు, వేణురావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలు నిర్వహిస్తున్న మృత్యుంజయశర్మ తదితరులు

దుబ్బాక: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ శైవ మహాపీఠం అధిపతి బ్రహ్మశ్రీ డాక్టర్ అత్తలూరి మృత్యుంజయశర్మ అన్నారు. ఆదివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, అన్నపూర్ణదేవి, భద్రకాళీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నందాల శ్రీజ శ్రీకాంత్, బంగారయ్య, నాయకులు సిద్ధిరాములు, శోభ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సాగు పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీదేవి

సిద్దిపేటరూరల్: తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తోర్నాల పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు ఉత్తమ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త శ్రీదేవి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం అభివృద్ధిలో వ్యవసాయ విశ్వవిద్యాలయ పాత్రను వివరించారు. అనతికాలం నుంచే విశ్వవిద్యాలయం నుంచి రూపొందించబడిన వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. ఉత్తమ సాగు పద్ధతిలో సాగు, యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను తెలియజేశారు. అలాగే మొగి పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా వేప నూనె, లింగార్షక బుట్టలు అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పల్లవి, రాజా, ఉమా రాణి, సరిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని చుంచనకోటలో ఆదివారం పెంచిన నిత్యావసర ధరలకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు గొర్రె శ్రీనివాస్, యాదగిరి, భీమరాజు, గుంటి కనకయ్య, కొమ్ము బాలయ్య పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సహాయం**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లికి చెందిన రాచకొండ లచ్చవ్వ అనారోగ్యంతో మృతిచెందగా ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, సర్పంచ్ లలితా కృష్ణారెడ్డి బాధిత కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ శనిగరం మల్లేశం, మాజీ ఎంపీటీసీ దేవరాజుల కనకమ్మ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

◆ **బాడీఫ్రీజర్ అందజేత**

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ఆకునూరు పంచాయతీకి గ్రామానికి చెందిన ఆకుల రమేష్ తన తండ్రి రాజయ్య జ్ఞాపకార్థం ఆదివారం బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు.

◆ **నూతన నియామకం**



గుగులోత్ భాస్కర్‌నాయక్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌కు చెందిన గుగులోత్ భాస్కర్‌నాయక్‌ను లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌నాయక్ ఆదివారం తెలిపారు. గిరిజన సమస్యలపై జిల్లావ్యాప్తంగా పోరాటం చేయాలని సూచించారు.

◆ **బాధితులకు అండగా ఉంటాం**

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్దమాసాన్‌పల్లి వడ్డెర కాలనీకి చెందిన బోదాసు శ్రీనివాస్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న పెద్ద మాసాన్‌పల్లి సేవాసమితి సభ్యులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.7500 ఆర్థిక సహాయంతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

◆ **విరాళం**



కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కిష్టంపేటలో నూతనంగా నిర్మిస్తున్న మహంకాళి ఆలయానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మొగుళ్ల రాజిరెడ్డి ఆదివారం రూ. లక్ష నగదును విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గారెడ్డి, నాయకులు బొంగు రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగిరెడ్డి, తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

◆ **స్నేహితుడి కూతురి వివాహానికి చేయూత**

గజ్వేల్‌రూరల్: స్నేహితుడి కూతురి వివాహానికి తోటి మిత్రులు చేయూతనందించి అండగా నిలిచారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల జిల్లా ప్రజాపరిషత్(బాలుర) ఉన్నత పాఠశాలలో (1992–93 బ్యాచ్) పదో తరగతి చదివిన రమేష్ కూతురు వివాహం ఆదివారం ప్రజ్ఞాపూర్‌లో జరిగింది. పూర్వ విద్యార్థులంతా కలిసి రూ. 82 వేలను రమేష్ కూతురు వివాహం సందర్భంగా అందజేసి చేయూతనందించారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని దొమ్మాటలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరు చేసిన రూ. 10 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలిపల్లి సుభాషిని, ఎంపీటీసీ వినోద, ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **చక్కెర కర్మాగారాన్ని రక్షించుకుందాం**

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతానికి గుండెకాయలాంటి ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని రక్షించుకుందామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సామాజిక నేత ఢిల్లీ వసంత్ అన్నారు. ఆదివారం జహీరాబాద్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.